క్లుప్తంగా

ముగిసిన శ్రీరామనామ సప్తాహం



శ్రీరామనామ సప్తాహ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ఏలూరి పద్మ, కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7వ శ్రీరామనామ సప్తాహం కార్యక్రమం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. 7 రోజుల పాటు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భజన బృందాలు తమ గీతాలాపనలతో భక్తులను భక్తి సాగరంలో ముంచెత్తారు. మండలంలోని వెంకటాయపాలేనికి చెందిన దాతలు మంచెం ఆంజనేయమూర్తి(చినబాబు), వెంకట సత్యరమ దంపతుల చేతుల మీదుగా పూర్ణాహుతి, సీతారాముల శాంతి కల్యాణం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నిర్మాతలు ఏలూరి మాణిక్యాంబ కుటుంబం ఏలూరి పద్మ కుటుంబ సభ్యులతో సప్తాహ కమిటీ నిర్వాహకులు గరగ బాబూరావు, వాసంశెట్టి నారాయణమూర్తి, ఏలూరి ప్రసాదరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. గొల్లపాలెం 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం, బందనపూడి, శలపాక, కాజులూరు 11 కేవీ ఇండ్రస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని అయితపూడి, తిప్పరాజుపాలెం, శీల, మేకలగరువు, పల్లిపాలెం కరప మండలం కొంగోడు తదితర గ్రామాల విద్యుత్‌లైన్‌లలోని ఇండస్ట్రియల్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

ఆకట్టుకున్న స్వీపింగ్ మెషీన్



ప్రధాన రహదారిలో రోడ్లను శుభ్రం చేస్తున్న స్వీపింగ్ మెషీన్

రామచంద్రపురం: మున్సిపాలిటీ నూతనంగా కొనుగోలు చేసిన స్వీపింగ్ మెషీన్ అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రధాన రహదారి, ఇతర సీసీ రోడ్లను సుభ్రం చేసేందుకు స్వీపింగ్ మెషీన్‌ను గతంలో మున్సిపాలిటీ కొనుగోలు చేసింది. అయితే గత కొంత కాలంగా దీని వినియోగానికి దూరంగా ఉంది. దీనిని గత రెండు మూడు రోజులుగా ప్రధాన రహదారిలోని డివైడర్లను, రోడ్లను పరిశుభ్రం చేస్తుంది. రోబో మాదిరిగా మెల్లగా కదులుతూ రోడ్లను శుభ్రం చేస్తూ అందరినీ ఆకట్టుకుంది.

శ్రీమన్నారాయణకు డాక్టరేట్

ముమ్మిడివరం: మండలంలోని గేదెల్లంకకు చెందిన కోలా శ్రీమన్నారాయణకు విశాఖ గీతం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆయన ప్రస్తుతం అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. మెటీరియల్ సైన్స్‌లో బేరియం, కాల్షియం, జిర్కోనియం ప్రతిక్షేపణలపై చేసిన పరిశోధనలకు ఆయనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ముమ్మిడివరం ఎంపీపీ కోలా గంగాభవానీ, కోలా బాబ్జి తదితరులు అభినందించారు.

శిశుమందిర్ ప్రధానాచారికి ప్రశంసాపత్రం

మలికిపురం: మండలంలోని లక్కవరం సరస్వతీ శిశు మందిరం హైస్కూల్‌కు 2023–24కు 100% టెన్త్ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో సంస్థ రాష్ట్ర స్థాయి ప్రతినిధుల నుంచి హైస్కూల్ ప్రధానాచారి వి.అరుణ ప్రశంసాపత్రం అందుకున్నారు. బుధవారం అనంతపురంలో జరిగిన సంస్థ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ మేరకు ప్రశంసా పత్రం, మెమెంటో అందుకున్నారు. ఈ సమావేశానికి పాఠశాల నుంచి సమితి ఉపాధ్యక్షుడు ఆర్‌సీవీ రాజు, అధ్యక్షుడు మంగెన గౌరీనాథ్, కమిటీ సభ్యులు సంద్యాల వెంకట కృష్ణ, సహ ప్రధాన ఆచార్య ప్రమీల హాజరయ్యారు.

దోమ కాటు - పాడికి చేటు

- పాడి పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- పశువులకు దోమతెర వినియోగం ఉపయోగకరం



పశువుల కొట్టాంలో మేత తీసుకుంటున్న పశువులు

రామచంద్రపురం రూరల్: ఇటీవల కురిసిన, కురుస్తున్న వర్షాలకు ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా వెలిశాయి. దీంతో మనుషులే కాదు మూగజీవాలు కూడా దోమకాటుతో బాధపడుతున్నాయి. దోమల నుంచి పశువులకు కాపాడుకుంటే పాడి పశువుల పోషణ ఆశాజనకంగా ఉంటుంది. లేని పక్షంలో పశువుల ఆరోగ్యం క్షీణించి, పాల దిగుబడి పడిపోతుందని రామచంద్రపురం మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున హెచ్చరిస్తున్నారు. పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వివరించారు.

ఈ సీజన్‌లో దోమలతో ఇబ్బంది..

సాధారణంగా దోమల వల్ల పశువులకు ఇబ్బంది. వర్షాలు పడే సీజన్ కావడంతో సమస్య తీవ్రంగా ఉంటుంది. మురుగులో దోమలు ఉత్పత్తి చెంది పశువులపై ప్రభావం చూపుతాయి. ఈ ప్రభావం పశువులపై పడకుండా చూడాల్సిన అవసరం ఉంది.

సమస్యలు ఇవి

- దోమకాటు వల్ల పాల దిగుబడిపై ప్రభావం పడుతుంది. దిగుబడి తగ్గుతుంది.
- మేత సరిగా తీసుకోవు. ఆకలి మందగిస్తుంది.
- మేత తినకపోవడంతో పశువులు బలహీనంగా తయారవుతాయి.
- పశువులు జ్వరం బారిన పడతాయి. పశువుల శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరిగిపోతుంది. సకాలంలో పశు వైద్యులకు చూపించాలి.
- చర్మం దురద వచ్చి పుండ్లు పడుతుంది. దురదలు, ఇతర అలర్జీకి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి.

జాగ్రత్తలు విధిగా పాటించాలి

- పశువులను పాక లేదా షెడ్డులోకి తరలించే ముందు దోమలు లోనికి వెళ్లకుండా చూడాలి.

పశువులను షెడ్లు/పాకలో కట్టేసిన తరువాత దోమ తెరలు కట్టి తెరకు రంధ్రాలు లేకుండా(పడకుండా) చూడాలి.

- సాయంత్రం వేప ఆకుతో పొగ పెట్టాలి.
- పశువులను కట్టే పాక/షెడ్డు చుట్టూ గుబురు పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.
- పశువులను కట్టేసే ప్రదేశాన్ని సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేసుకోవాలి. తద్వారా పశువుల కాళ్ల వద్ద మురుగు, వ్యర్థాలు నిల్వ ఉండవు.
- షెడ్డును ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, మంచి నీటితో కడగాలి. తద్వారా వచ్చిన నీరు కాలువల్లోకి మళ్లించాలి.
- పశువుల వ్యర్థాలు, అవి తినగా వదిలేసిన మేత నిల్వ ఉంచకూడదు. ప్రాంగణాన్ని శుభ్రపరుచుకోవాలి.
- పశువులకు నీటిని అందించే కుడితి తొట్టెల్లో నీటిని నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉండేలా చూడాలి.
- పాక/షెడ్డుల్లో మేత వేసేందుకు గాడి ఎక్కువ లోతులో ఉంచుతున్నారు. మూడు అడుగుల కన్నా ఎక్కువగా లోతులో గాడి ఉంచితే మేతలో దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి.
- కేవలం అరడుగు నుంచి అడుగు లోతు, రెండు అడుగుల వెడల్పు మాత్రమే మేత గాడి ఉండేలా చూడాలి.

అప్రమత్తంగా ఉండాలి



దోమల వల్ల ఎలాంటి నష్టం జరుగకుండా పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం, అలర్జీ, దోమకాటుల నుంచి పశువులను సంరక్షించుకోవాలి. లేని పక్షంలో పాలదిగుబడిపై ప్రభావం పడి పాడి రైతులు ఒక్కోసారి పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి ఉంటుంది. – **మేడిశెట్టి కృష్ణార్జున,** పశు వైద్యాధికారి, రామచంద్రపురం మండలం

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో పశువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు
రామచంద్రపురం	3940	8540
కె.గంగవరం	3402	11242
కాజులూరు	4830	8332
మండపేట	3860	8630
రాయవరం	2800	8000
కపిలేశ్వరపురం	2967	8430

కుష్ఠును సమూలంగా రూపుమాపాలి



అంగరలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: కుష్ఠు వ్యాధిని సమూలంగా రూపు మాపే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్ ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, ఎస్ఎల్ఈపీ నోడల్ అధికారి వెన్నేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో వైద్య, ఆరోగ్య కార్యకర్తలు అంగర, పడమరకండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వే చేస్తున్నామన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, శరీరంపై నొప్పిలేని బొడిపెలు తదితర లక్షణాలు కలిగిన వారు పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిండు శోకంతో మొహర్రం



ద్రాక్షారామలో మాతం(రక్త తర్పణం) చేస్తున్న ముస్లింలు

- కర్బలా అమర వీరులకు శ్రద్ధాంజలి

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలో మొహర్రం సంతాప దినాలను నిండు శోకంతో నిర్వహించుకున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి విచ్చేసిన మత గురువు అలి అష్గర్ ఆబేది సాహెబ్ మజ్లిస్‌ల రూపంలో కర్బలా అమర వీరుల త్యాగాలను వివరించారు. శతాబ్దాలు గడచినా ఆ విషాద ఛాయలు ఇంకా శోకాన్ని పంచుతూనే ఉన్నాయి. 1405 సంవత్సరాల క్రితం ఇరాక్‌లో చిందించిన రక్తం తడి నేటికీ ఆరలేదు. ప్రవక్త ఇమాం హుస్సేన్ అమరత్వం ఇప్పటికీ గుండెలను పిండుతూనే ఉంది. ప్రతి సంవత్సరం వారి జ్ఞాపకాలు ఇప్పటికీ కళ్లు చెమర్చేలా చేస్తున్నాయి. ఇమాం హుస్సేన్ షహీద్ (వీర మరణం) సందర్భంగా 11 రోజుల పాటు ద్రాక్షారామలో పీర్ (ఆలం) గుర్రంపై ఊరేగింపు, మాతం (రక్త తర్పణం) జరిగాయి. ముస్లిం పెద్దలు, చిన్నలు, యువకులు, మహిళలు విషాద గేయాలను ఆలపిస్తూ శోకంతో భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 7న చంద్ర దర్శనంతో ఇస్లాం క్యాలెండర్‌లోని మొదటి నెల 'మొహర్రం' ప్రారంభమైంది. ముఖ్య రోజుల్లో జులూస్ (ఊరేగింపులు), నిప్పులగుండంపై నడవడం, మజ్లిస్‌లు వంటి ఇమాం భక్తి కార్యక్రమాలు జరుపుకొన్నారు. రంగురంగుల వస్త్రాలతో పీరులను ఊరేగించి పంజాల్లో ఉంచి పూజించారు. మంగళవారం రాత్రి మాతంతో ఆగా వారి పెద్ద పంజా నుంచి బార్‌మే ఇమాం (తల్లిపీరు) ఊరేగింపు ప్రధాన ఘట్టంగా నిర్వహించారు. ఇమాం హుస్సేన్ షహీద్(వీర మరణం) రోజైన బుధవారం ఉదయం ప్రత్యేక నమాజు చేసి, పెద్ద మసీదు సెంటర్ నుంచి హజరత్ అబ్బాస్ రోడ్డు వరకు ఆయా పంజాల వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తూ తమ వీపుల పైన, ఛాతీల పైన, శిరస్సులపైన రక్తం చిందేలా మాతం చేసి ఇమాం హుస్సేన్‌పై భక్తిని చాటుకున్నారు. మొక్కులను సమర్పించుకున్నారు. పీరులు(ఆలం)లను, గుమ్మటాలను చెరువుకు తీసుకునివెళ్లి కడిగి శాంతింపజేశారు. పంజాముజావర్లు, అంజుమన్ సంఘాలు భక్తులకు భోజన వసతి కల్పించారు. ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాలు, ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పాల్గొన్నారు. ఇమాం హుస్సేన్ అభిమాన సంఘాలు, పలు స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాల్లో సహకారమందించాయి.



అంగర మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగపూరిత జీవితానికి ప్రతీక మొహర్రం

కపిలేశ్వరపురం: దైవ ప్రసన్నతే లక్ష్యంగా సాగిన సమరంలో హజ్రత్ హిమామె హుసైన్ అమరుడు కావడం త్యాగ పూరిత జీవితానికి ప్రతీక అని అంగరలోని మస్జిద్–ఎ–ఇబ్రహీమ ఇమామ్ మహ్మద్ నాజీం అక్తర్, ముతవలి అబ్బాస్ హుస్సేన్ అన్నారు. మొహర్రం సందర్భంగా బుధవారం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారు మాట్లాడుతూ మొహర్రంను విషాదం అనుకోవడం సరైంది కాదని, వీరులను స్మరించుకునే గొప్ప దినమన్నారు. వీరుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా జీవిత పరమార్థాన్ని తెలుసుకునే రోజు అన్నారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక పరిసర గ్రామాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

విశేషంగా తొలి ఏకాదశి పూజలు

మండపేట: తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం మండపేట పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం విశేష పూజలు జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పట్టణంలోని రథం గుడి, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని అర్చకుల ఆశీర్వచనాలు స్వీకరించారు. తొలి ఏకాదశి సందర్భంగా మహిళలు తెల్లవారుజామునే మంగళ స్నానాలు ఆచరించి సమీప దేవాలయాల్లో భక్తి శ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక సీతారామ క్షేత్రంలోని సీతారామ చంద్రుల వారు విశేష పూజలు అందుకున్నారు. కలువపువ్వు సెంటర్లో వెలసిన దర్గమ్మతల్లి ఆలయంలోను పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ద్వారపూడిలోని వాసవీ వీధిలో కొలువు తీరిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వాసవీమాతను 66 రకాల కూరగాయలతో శాకంబరీ మాతగా అలంకరించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అంగరలోని శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో 12 ఏకాదశుల పూజలో భాగంగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఆఖరి పూజ డిసెంబర్ 26 న నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో స్వామి ఊరేగింపు అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో నిర్వహించారు. స్వామి శేషపాన్పుపై పవళించే రోజుగా వేద పండితులు అభివర్ణించారు. కపిలేశ్వరపురం, వల్లూరు, నల్లూరు, నేలటూరు, కాలేరు, టేకి, వాకతిప్ప, తాతపూడి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు చేశారు.



గొల్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



అంగరలోని వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

కాజులూరు: మండల గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి పురస్కరించుకుని పలు ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కాజులూరు, గొల్లపాలెం, అయితపూడి, శీల, కోలంక గ్రామాలలోని వేంకటేశ్వస్వామి ఆలయాలతో పాటు పలు గ్రామాలలోని అమ్మవారి ఆలయాల్లోనూ భక్తులు వేకువజాము నుంచి దర్శనాల కోసం బారులు తీరారు. గొల్లపాలెం వేణు గోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి కృష్ణమోహనాచార్యులు, బలరామాచార్యులు, వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు సర్వే రామకృష్ణామాచార్యులు, సర్వే అరవిందులు స్వామివారికి చామంతి పూలతో సహస్ర నామార్చన నిర్వహించి అమ్మవారికి ప్రీతికరమైన కుడలై ప్రసాదం నివేదన చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.



మండపేట రథం ఆలయంలో హారతి అందుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

వెదురుపాక విజయదుర్గా పీఠంలో..

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠానికి వచ్చిన భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో వెదురుపాకలోని విజయదుర్గా అమ్మవారు

విలువిద్యలో మేటి ఏకలవ్యుడు



ఏకలవ్యుని చిత్ర పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, ఎరుకల సంఘం నాయకులు



అముజూరులో ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎరుకల సంఘం నాయకులు



రాయవరంలో ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎరుకల సంఘం నేతలు

మండపేట: ఏకలవ్యుని జయంతి వేడుకలను బుధవారం పట్టణంలోని ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రైతు బజార్ షాదీఖానా వద్ద, రామచంద్రుడు కాలువ గట్టు వీధిలోను నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ పాల్గొన్నారు. ఏకలవ్యుని చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు తమ ప్రసంగాల్లో ఏకలవ్యుని గొప్పతనాన్ని వివరించారు. విలువిద్యలో ఆయనను మించిన వీరుడు మరొకరు లేరని కొనియాడారు. తొలుత కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అమలదాసు లక్ష్మీ రుద్రమూర్తి దంపతులు, దాసరి నూకరాజు, సింగం రాంబాబు, మనుపూడి సహదేవుడు, అమలదాసు పోసయ్య, బీజేపీ నాయకుడు కోటిపల్లి సాయిరాం, ఎండీ కరీం, ఎమ్మార్పీఎస్ నాయకుడు దూలి జయరాజు, జొన్నపల్లి సత్తిబాబు, పాలమాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుని జయంతి

కె.గంగవరం: మండలంలోని అముజూరులో బుధవారం ఏకలవ్యుని జయంతిని ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, వారి కుటుంబ సభ్యులతో అత్యంత ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. తొలుత సంఘ సభ్యులు నాయకులు కలసి ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం నిర్వహించిన సభలో మండల స్థాయి ఎరుకుల సంఘం పెద్దలు అధ్యక్షుడు బెల్లంకొండ గోవింద్, కార్యదర్శి సంగడాల రాజు తదితరులు మాట్లాడుతూ ఏకలవ్యున్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజంలో జీవించాలన్నారు. రాజకీయ పార్టీలు ఎరుకుల కులానికి చెందిన ఓట్లను దండుకుంటున్నారే కానీ తమకు న్యాయం చేయడం లేదన్నారు. రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు ప్రతి మండలంలో ఎరుకల సంఘానికి కమ్యూనిటీ హాల్ కేటాయించాలని, రాజ్యాంగం ప్రకారం ఎరుకుల కులాన్ని గుర్తించాలని కోరారు. గ్రామ సర్పంచ్ నానాపరకు కళ్యాణి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో ఏకలవ్యుని విగ్రహానికి కావాల్సిన నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎరుకల సంఘ నాయకులు, పలు గ్రామాల నుంచి వచ్చిన సంఘ సభ్యులకు కుటుంబాలతో సహపంక్తి భోజనాలు చేశారు. సంఘ మాజీ అధ్యక్షుడు అమలదాసు రాంబాబు, క్యాషియర్ అమలదాసు తాతబ్బాయి, జాయింట్ కార్యదర్శి మానుపాటి వీరబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాయవరంలో..

రాయవరం: ఏకలవ్య జయంతిని రాయవరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎరుకల సంఘం మండల శాఖ అధ్యక్షుడు గాడా పట్టాభి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎరుకల సంఘం అధ్యక్షుడు మానుపాటి రామకృష్ణ, కోనసీమ జిల్లా కార్యదర్శి సమతం పాపారావు మాట్లాడారు. ఎరుకల సంఖ్యాబలానికి తగ్గట్టుగా ప్రతి గ్రామంలోనూ కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని వారు కోరారు. ఎరుకల సామాజిక వర్గానికి రిజర్వేషన్ అమలు చేసే విధానంలో ఏజెన్సీ ఏరియాతో పాటు ఎస్టీ ప్లెయిన్ ఏరియాలో కూడా భారత రాజ్యాంగం ప్రకారం ఉన్న రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందుగా ఏకలవ్యుడి చిత్ర పటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం మండల శాఖ సలహాదారు జి.గోవిందు, జిల్లా కార్యదర్శి ఎస్. శ్రీను, మండల శాఖ కార్యదర్శి ఎస్.నూకరాజు, సంయుక్త కార్యదర్శి ఎల్.ఏసుబాబు మండలంలోని ఎరుకల సామాజిక వర్గానికి చెందిన సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోషక లోపమే దిగుబడికి అడ్డంకి

మలికిపురం: పోషక లోపమే దిగుబడికి అడ్డంకి అని ప్రకృతి వ్యవశాయ జిల్లా అధికారి ఎలియాజార్ అన్నారు. బుధవారం కేశనపల్లిలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇందుకు సంబంధించి ఏక పంటల విధానం, పోషకాల లభ్యత, చీడ పీడలు, సక్రమంగా లేని నీటి యాజమాన్యం, కలుపు సమస్యలపై ఎలియాజార్, కొబ్బరి రైతులతో చర్చించారు. ఈ మేరు ఆయా అంశాలపై సమగ్ర సమాచారం వారికి అందించి, తగిన సలహాలు, సూచనలు అధికారుల నుంచి పొందాలని కోరారు. అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, రైతులు యడ్ల విష్ణుమూర్తి, గెడ్డం వసంత కుమార్, అడబాల మూలాస్వామి, నల్లి నాగేశ్వరరావు, రావూరి ఏసు, యడ్ల వెంకట రమణ, వ్యవసాయ సిబ్బంది మట్టా శ్రీనివాసరావు, మురళి, కిరణ్, నాగబాబు, సురేష్, రవికాంత్ పాల్గొన్నారు.



కేశనపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఊడిమూడిలంక వంతెన పనుల పరిశీలన



ఊడిమూడిలంక వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఎస్ఈ రవీంద్ర

పి.గన్నవరం: వశిష్ఠ నదీపాయపై రూ.49.5 కోట్లతో నిర్మిస్తున్న ఊడిమూడిలంక వంతెన నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఎస్ఈ రవీంద్ర బుధవారం పరిశీలించారు. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లంక గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం గతేడాది వంతెన పనులను ప్రారంభించిన విషయం విదితమే. శరవేగంగా జరుగుతున్న ఈ వంతెన పనులపై ఎస్ఈ రవీంద్ర సంతృప్తి వ్యక్తం చేశారు. 3, 4వ నెంబర్ల పిల్లర్లకు వెల్ ఫౌండేషన్‌ను పరిశీలించి బాటమ్ ప్లగ్గింగ్‌కు ఆయన అనుమతి ఇచ్చారు. వరదలు వచ్చేలోగా ఈ పనులను పూర్తి చేయాలని అధికారులను ఎస్ఈ ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ కె.చంటిబాబు, డీఈఈ అన్యం రాంబాబు, ఏఈఈలు కొండలరావు, సత్యనారాయణ, కాంట్రాక్టర్ పీపీ రాజు, డిజైనర్ కుమార్ పాల్గొన్నారు.